గెత్తుకు వెళ్ళి "మీతో మరో రెండు నిమిషాలు ఏకాంతంగా మాట్లాడవచ్చా స్వామీ" అన్నాడు నమ్రతగా. స్వామి సైగనందుకుని డ్రైవరుదిగాడు. విహారి కారు నడపడం ప్రారంభించాడు. విహారి కారుని వెనుకే తీసుకు వస్తున్నాడు డ్రైవరు. కానీ ఆ స్పీడు అందుకోలేక వదిలేసాడు.

"ఏమిటి చెప్పు-"

"మీరింత గొప్పవాళ్ళు ఎలా అయ్యారు?"

"రాజకీయం, బలం, తెలివి — అంతా నా సొత్తే" నవ్వేడు.

"కానీ న్యాయం, చట్టం వగైరా వుంటాయిగా స్వామీ!"

"ఇవన్నీ ఎందుకు అడుగుతున్నావు?"

"నేను మీలో చేరితే, ఏ విధంగా రక్షణ లభిస్తుందా అని!"

"పిచ్చివాడా- అప్పుడు రక్షణ ప్రసక్తే లేదు!"

"కానీ చట్టం?"

"సాక్ష్యం లేకుండా చట్టం లేదు."

విహారి చేతిలో కారు వేగం మరింత హెచ్చింది. నూరు కిలో మీటర్లు దాటింది. "ఏమిటిది-" అన్నాడు.

"మీలో చేరితే రక్షణ అవసరమే వుండదన్నారు. మరి ఇప్పుడు మీకే రక్షణ లేదే!"

"ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది?"

"మీరన్నది నిజమే. ప్రభుత్వం మీ క్రింద వుంది. రాజకీయ నాయకులు మీ భక్తులు. కానీ ప్రభుత్వాధికారులకు ప్రమోషన్‌దాహం. నాయకులకి పదవి భద్రత ముఖ్యం. వాళ్ళు కొన్ని వ్రతాల్లో, కొన్ని నిబంధనలకు లోబడి పని చెయ్యాలి. ఉదాహరణకి కొన్నాళ్ళ క్రితం మీరో అమ్మాయి కార్లో ఎక్కారు. ఆమె మిమ్మల్ని ఏమీ చెయ్యలేకపోయింది. కారణం? ఆమె ప్రభుత్వాధికారి కనుక! నేనలా కాదు. నేను ప్రైవేటు మనిషిని — కేరేపిన్ లాటివాడిని. ఈ దేశపు సగటు మనిషిని. నన్ను మీరేం చేయలేరు. నేనే ఏమైనా చేయగలను"

"అంటే... ఏం చేస్తావ్?" అనుమానంగా అడిగాడు.

"ప్రేమ-జాలి, దయా-దాక్షిణ్యం — ఇలాటి వేమీ నాకు లేవు. ఇప్పుడు మీరు కొత్తగా చెప్పిన పాఠం ప్రకారం సాక్ష్యం లేకపోతే కేసులు కూడా లేవు. అదే మీమీద ప్రయోగిద్దామనుకుంటున్నాను!"

"నన్ను చంపుతావా?"

"చంపను. మీలాటి అల్పప్రాణులు శత్రువులైతే పోరాటం భలే రంజుగా వుంటుంది. నాకు సరదా సరదా చెలగాటం. మీకేమో బ్రతుక్కీ చావుకీ మధ్య అంతిమ పోరాటం!"

"నువ్వెవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"

"ఈ దేశపు అత్యంత క్రూరమయిన వ్యక్తితో. ఈ దేశానికి త్వరలో సార్వభౌముడు అవ్వాలనుకుంటున్న మహామాన్వితుడితో. ప్రస్తుతం నాతోపాటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వస్తున్న వ్యక్తితో. అనంతానంత స్వామీ! అనవసరంగా నాతో పెట్టుకున్నారు మీరు. ఫలితం అనుభవించక తప్పదు."

అంటూ కారు ఆపాడు. పక్కకి తిరిగి, తనవైపే చూస్తున్న స్వామి నెత్తిమీద బలంగా ఒక్క జెల్ల ఇచ్చి "సభలో నాకు అవమానం చేయించినందుకు. దీనికి సాక్ష్యం లేదు" అన్నాడు. చిన్న శిఖరం మీద వుంది కారు. క్రింద నగరంలో దీపాలు కనపడుతున్నాయి.

స్వామి మొహం ఎర్రబడింది. అట్నుంచి దిగబోయాడు. ఈసారి అటొచ్చి చెంపఅదిరేలా కొట్టాడు. "ఇది పిల్లాడ్ని చంపినందుకు... దీనికీ సాక్ష్యం లేదు!"

స్వామి సీట్లో వెల్లకిలా పడ్డాడు. విహారి కారు డోర్ వేసేశాడు. "మీ నాలుగో స్తంభం ఎవరు? సామాన్యుడా? ఈ దేశపు సామాన్యుడు అంత తెలివి తక్కువ వాడు కాదు స్వామీ! అంత పిరికివాడు కూడా కాదు. అదేమిటో మీముందే నిరూపించానిప్పుడు. పోతే దేము డవడం కోసం మీరు జీవహింస చేయరు. ఈ దేశపు పౌరుడు 'మనిషి'గా బ్రతకడంకోసం మీలాటి దుర్మార్గుల్ని సహనంతో భరిస్తాడు. పాపం బద్దలవుతే... ఇదిగో ఇలా తయారు అవుతుంది మీ పరిస్థితి" అంటూ కారుని కాస్త ముందుకి తోసాడు.

కారు లోయలోకి జారడం ప్రారంభించింది. స్వామి లోపల్నుంచి అరుస్తున్నాడు.

కారు రాళ్ళకి కొట్టుకుని పక్కకి తిరిగి, మళ్ళీ జారడం ప్రారంభించింది. విహారి ఎలుగెత్తి అన్నాడు. "పది కార్ల ఫ్యాక్టరీలు పెట్టగలరు కదా స్వామీ మీరు! బ్రతికుంటే కొత్తకారు కొనుక్కోండి. బెస్టాఫ్ లక్"

కారు మరింత క్రిందికి జారింది. క్రిందంతా బురద ఊబిలా వుంది.

విహారి కొండమీద అలాగే నిలబడి, జారే కారుని చూస్తూ జేబులోంచి సిగరెట్ తీసుకుని కాజ్‌గా వెలిగించుకున్నాడు. అగ్గిపుల్ల కిందకి విసిరేసి, చేతులు రెండూ పాంటు జేబుల్లో పెట్టుకుని అక్కడ నుంచి వెనుదిరిగి, తాపీగా నగరంవైపు నడవడం ప్రారంభించాడు.

బురదలోంచి ముందు బుడగలు బయటకొచ్చాయి. అర నిమిషం తరువాత అతికష్టం మీద స్వామి అందులోంచి బయటకు వచ్చాడు. ముందు అతడి తల వచ్చింది. దానిమీద మంచి క్రిందకి బురద కారుతోంది. ఇనుప అచ్చులోంచి బయటకు వచ్చిన ఆకారంలా వుంది అది.

ఆ తరువాత అతడి మొహం బయటకు వచ్చింది. ప్రతిపక్ష రణదక్ష వక్షవిచ్ఛేదనా దక్షతవల్ల వచ్చిన అరుణిమతో అది ఉగ్రరూపం దాల్చివుంది. ఆ నిశ్శబ్దపు లోయలో అతడి గొంతు ప్రతిధ్వనించింది.

"విహారీ! ఇంతవరకూ ఈ అనంతానంతస్వామితో ఎవరూ ఈ రకంగా చేయి కలపలేదు. నేనేం చేస్తానో — ఏం చేయగలనో నీకు చేసి చూపిస్తాను. నరకం అంటే ఎలా వుంటుందో భూమ్మీదే రుచి చూపిస్తాను."

[ఇంకావుంది]

"దొంగ దొంగ" అన్న భార్య కేకలకి తక్కువ మెళుకువ వచ్చి స్ప్రింగ్‌లా లేచాడతను.

పెరటి తలుపు నుంచి అన్ని తలుపులూ, బార్లా తెరచి వున్నయ్!

దేదీప్యమానంగా లైట్లు వెలిగిపోతున్నాయ్!

తెల్లవారు ఝామున మూడు గంటలు దాటింది. నగరం ఇంకా మేలుకోలేదు.

అతని గుండె ఝల్లుమంది!

అంతకు ముందు రాత్రే ఆఫీసు డబ్బు అయిదువేలుంచాడు ఐరన్ అల్మరాలో. అది గానీ ఒక వేళ పోయుంటే?

ఒక్క ఉదుటున లోపలికి పరుగెత్తి ఐరన్ అల్మరా చూస్తే - తాళం వేసింది వేసినట్టే వుంది! అయినా వుండ బట్ట లేక తాళం తీసి చూస్తే - ఆఫీసు డబ్బు యథా స్థానంలోనేవుంది!

పక్కనే ట్రంకు పెట్టెలో వెండి సామాను - అలానే వుంది.

# నవ్య చౌర్యం

చెక్క బీరువాలో పట్టు చీరలు - చెక్కు చెదర్లేదు!

ఇంకో పెట్టెలో స్టీలుసామాను - అంతా అలానే వుంది.

ఇస్త్రీ బట్టలు - అన్నీ అలానే వున్నాయి.

రేడియో, ట్రాన్సిస్టరూ, అలారం పీస్ - అన్నీ వాటి స్థానాలలోనే వున్నాయ్!

ఆఖరికి పెరట్లో ఆరేసిన బట్టలు కూడా అలానే వున్నాయ్!

మరింకేం పోయినట్టు?

దొంగలుపడ్డారన్నది మాత్రం ఖచ్చితం! లోపల్నించి గడియ వేసిన తలుపులు తెరచి వుంచడం, ఆర్పేసిన లైట్లువెలుగు తుండడం - అవును! ఖచ్చితంగా దొంగలు పడ్డారు. కానీ... ఏం తీసుకుపోయినట్టు?

అతను మళ్ళీ అన్నీ మరోసారి పరిశీలనగా చూశాడు.

ఊహూ! ఏమీ పోలేదు. అన్నీ అలాగే వున్నాయ్.

ఆఖరికి - పది రోజుల కొకసారొచ్చే పంపు నీళ్ళు పట్టి పెట్టిన ఆరుబిందెలు కూడా నిశ్చలంగా వున్నాయ్! కాకపోతే ఆ బిందెల్లో వుండాల్సిన మంచినీళ్ళు మాత్రం లేవు!

- కె.రాం ప్రసాద్